క్లుప్తంగా

నేడు చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు రాక

పులివెందుల : స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఈనెల 29వ తేదీన ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రముఖచర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం(శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కోరుకుట, జట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్ఠు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అందుబాటులో గ్యాస్ట్రో ఎంట్రాలజీ సేవలు

పట్టణంలోని భాకరాపురంలో గల దినేష్ మెడికల్ సెంటర్ (గంగిరెడ్డి ఆసుపత్రి)లో అధునాతన వైద్య బృందం, పరికరాలతో గ్యాస్ట్రోఎంట్రాలజీ చికిత్సలు ప్రారంభించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి వైద్య సేవలు అందిస్తారన్నారు. దినేష్ మెడికల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పులివెందుల ప్రాంత ప్రజలు గ్యాస్ట్రో వైద్య సేవలకు, కడప, ప్రొద్దుటూరు వంటి ప్రాంతాలకు వెళ్లేవారన్నారు. ప్రస్తుతం స్థానికంగానే లభిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కన్నెలూరులో జ్యోతి ఉత్సవాలు



చౌడేశ్వరిదేవి మూలవిరాట్

జమ్మలమడుగు : పట్టణంలో నేడు జరిగే కన్నెలూరు జ్యోతి ఉత్సవాల కోసం రామలింగ చౌడేశ్వరదేవి ఆలయం ముస్తాబైంది. కొంతకాలంగా కన్నెలూరు జ్యోతి ఉత్సవాలు జరుగకపోవడంతో గ్రామ పెద్దలు గ్రామ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు అమ్మవారికి ప్రత్యేక అలంకారం నిర్వహించారు. శనివారం రాత్రి జ్యోతి నుంచి జ్యోతి ఉత్సవాలను నిర్వహించనున్నారు.

ఫిర్యాదులు వస్తే సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌ఓ మల్లారెడ్డి

సింహాద్రిపురం : గ్రామ పరిధిలోని ఏవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ మల్లారెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రమైన సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల ఫిర్యాదులను వెంటనే పోలీస్‌స్టేషన్‌లో తెలపాలని.. మీ ఇష్ట వచ్చినట్లు వివరించకూడదన్నారు. అనంతరం ఆయన మహిళా పోలీసుల రికార్డులను పరిశీలించారు.

మామిడి తోటల్లో సస్య రక్షణ చర్యలు తప్పని సరి



సస్యరక్షణ చర్యలను రైతులకు వివరిస్తున్న ఉద్యానశాఖ అధికారి రెడ్డెయ్య

చక్రాయపేట : మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే రైతులు అధికలాభాలు చేపట్టవచ్చని మండల ఉద్యాన శాఖ అధికారి రెడ్డెయ్య తెలిపారు. శనివారం మండలంలోని సురభి గ్రామంలో మామిడి రైతులకు అవగాహణ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మామిడి తోటలను పరిశీలించిన అనంతరం మామిడిలో ఉన్న తెగుల్లను గుర్తించారు. ప్రస్తుతం మామిడిలో మొగ్గ, పూత, బఠాణీ సైజులో ఉన్న పిందె ఉందన్నారు. దీనికి తోడు తేనె మంచు పురుగు ఉధృతి ఉన్నందున వాటి నివారణకు థయోమిథాక్సిన్ 25 డబ్ల్యూ 0. 3 గ్రాములు లీటరు నీటికి లేదా బుప్రోఫెజిన్ 25 ఎస్‌సి 1.2మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. పిందె రాలడం నివారించడానికి ప్లానోఫిక్స్ 4.5 లీటర్ల నీటికి 1 మి.లీ చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. వీటితో పాటు ఆర్కా మ్యాంగో స్పెషల్ 5 గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే ఇన్‌చార్జ్ వినోద్, ఉద్యాన శాఖ సహాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథ సప్తమి వేడుకలు



శ్రీవెంకటరమణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



గ్రామోత్సవంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి

పులివెందుల టౌన్/రూరల్ : పట్టణంలోని స్థానిక శ్రీవెంకటరమణస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రథ సప్తమి సందర్భంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. స్వామివారు ప్రత్యేక వాహనంలో సూర్య వాహనంపై కొలువుతీరి స్థానిక పూలంగళ్ల సర్కిల్ వద్ద ప్రత్యేక పూజలు అందుకున్నారు. సూర్య కిరణాలు పడేవరకు ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభంలో వెంకటరమణస్వామి తమ ఇంటి ముంగిటకు రాగానే భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి ఆ దేవ దేవుడిని వేడుకున్నారు. అలాగే మండల పరిధిలోని తుమ్మలపల్లె, రాయలాపురం, అచ్చివెళ్లి, కనంపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో ఇళ్ల ముందర రథ సప్తమి వత్రానికి సంబంధించి ముగ్గులు వేసి ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. రథసప్తమి సందర్భంగా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఘనంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం

వేంపల్లె : రథ సప్తమి సందర్భంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవంను ఘనంగా నిర్వహించారు. పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీ వృషభాశళేశ్వరస్వామి దేవస్థానం అనుసంధానమైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ చైర్మన్ వెంకటేష్‌ల ఆధ్వర్యంలో అర్చకులు అచ్యుత్ నారాయణాచార్యులు నేతృత్వంలో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పాటలు పాడి భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తుల సహకారంతో పట్టణ పురవీధులలో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే మెయిన్ బజార్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, ఎద్దుల కొండ్రాయుడు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొలవలి ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా చిన్న గంగయ్య

ముద్దనూరు : మండలంలోని కొలవలి పంచాయతీ ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా కుర్లి చిన్న గంగయ్యను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు అందాయి. గత ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికైన బలిశెట్టి వరలక్ష్మి అనారోగ్యంతో 2022 డిసెంబరు 2వ తేదీన మరణించారు. ఈ నేపథ్యంలో పరిపాలనా సౌలభ్యం కోసం ప్రస్తుతం ఉప సర్పంచ్‌గా వున్న చిన్న గంగయ్యను ఇంచార్జ్ సర్పంచ్‌గా నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు అందినట్లు ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎంపీడీఓ రమణారెడ్డి గంగయ్యకు ధృవీకరణపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రెహమాన్, వైఎస్సార్‌సీపీ పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, పార్టీ నాయకులు వరప్రసాద్‌లు పాల్గొన్నారు.



గంగయ్యకు ధృవీకరణపత్రాన్ని అందిస్తున్న ఎంపీడీఓ

నేడు సచివాలయ కన్వీనర్లకు సమావేశం

పెండ్లిమర్రి : స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు గ్రామ సచివాలయ కన్వీనర్ల, గృహ సారదులకు సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు రామమోహన్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని సచివాలయ కన్వీనర్ల, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని వారు కోరారు.

హాకీకి పూర్వ వైభవం తీసుకురావాలి

కడప స్పోర్ట్స్: హాకీ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి బోళానాథ్‌సింగ్, మాజీ కార్యదర్శి ముస్తాక్‌లను కడప ధ్యాన్‌చంద్ అకాడమీ డైరెక్టర్ ఎస్. సుభాన్‌బాషా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భువనేశ్వర్‌లో హాకీ ఇండియా ప్రతినిధులను కలిసి ఇటీవల వరల్డ్ కప్ నిర్వహించడంపై సంతోషాన్ని వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. హాకీ క్రీడకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కడప నగర కార్పొరేటర్లు షంషీర్, గౌస్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ప్రశాంతంగా జీవించాలి



మాట్లాడుతున్న జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్

జమ్మలమడుగు రూరల్ : ప్రజలు గొడవలకు, ఫ్యాక్షన్ లకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ అన్నారు. శనివారం ఆయన కోర్టు హాలులో ఫిబ్రవరి 11వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎన్నో సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి ఉన్నతాధికారులు ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నారని కక్షిదారులు సద్వినియోగం చేసుకొనేలా అధికారులు చూడాలన్నారు. రాజీ కావడం ఉత్తమ మార్గమని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగరాజు, సీఐలు, బార్ అసోసియేషన్ కార్యదర్శి కె.మురళీధర్‌రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

జమ్మలమడుగు : ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభమయ్యే కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగాని ప్రాధాన్యత ఇచ్చి అధిక నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో విలేకరులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కొఠారి కమిషన్ 1964 విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం, జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలని సూచనలు చేసింది. అయితే ఇప్పటి వరకు పాలకవర్గం అమలు పరచిన దాఖలాలు లేవన్నారు. ఈ బడ్జెట్‌లో ఏపీ ఉన్నత విద్యారంగానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలన్నారు. అదేవిధంగా రాయలసీమకు ప్రత్యేకంగా నిధులతోపాటు, ఉక్కు పరిశ్రమకు అత్యధిక నిధులు కేటాయించి పనులు త్వరగా ప్రారంభమయ్యేవిధంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలపై పరిశీలన

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్లు ఏఏ దశలలో ఉన్నాయో తెలుసుకునేందుకు పూర్తి విచారణ చేపడుతున్నట్లు హౌసింగ్ డీఈ విజయబాబు తెలిపారు. శనివారం ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలోని ఇళ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. బీబీఎల్, బీఎల్, ఆర్‌ఎల్ దశలలో ఎన్ని ఇళ్లు ఉన్నాయో తెలుసుకునేందు ఈ సర్వే జరుగుతోందన్నారు. అలాగే బిల్లులు ఏఏ దశలలో ఉన్నాయి.. వాటి వివరాలను విచారణ చేస్తున్నామన్నారు. కొన్ని చోట్ల బీఎల్ వరకు కట్టి ఆర్‌ఎల్ బిల్లులు తీసుకున్నట్లు తెలుస్తోందని అందుకు ఈ సర్వే చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ కార్యాలయ బృందం పాల్గొన్నారు.



ఎర్రగుంట్ల జగనన్న కాలనీలో ఇళ్లను సర్వే చేస్తున్న హౌసింగ్ డీఈ విజయబాబు

ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో గృహ సారథులు చురుగ్గా పనిచేయాలని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన వలంటీర్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వానికి వలంటీర్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు మూల స్తంబాల్లాంటివారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నమ్మకం పెట్టుకున్నారని ఆయన మీ మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. గతంలో ప్రతి 50 ఇళ్లకు ఒక్క వలంటీర్‌ను నియమించడం జరిగిందని ప్రస్తుతం మరో ఇద్దరు చొప్పున కన్వీనర్లు, గృహసారథులను నియమించడంతో పాటు మరో ఇద్దరు డ్వాక్రా మహిళలను బాగ స్వాములను చేయడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా వారికి కేటాయించిన 50 ఇళ్ల వద్దకు కలసికట్టుగా వెళ్లి వారికి తెలియజేయడంతో పాటు వారి సమస్యలను గుర్తించి వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ విజయం కొరకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కృషిచేయాలని తెలిపారు. వీరందరికీ ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం జరుగుతోందని తెలియజేశారు. కార్యక్రమంలో సీకేదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజుల్ రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అజ్మీర్ షరీఫ్ జెండా ఊరేగింపు

జమ్మలమడుగు : అజ్మీర్ షరీఫ్ ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరా ఖాద్రీ సారథ్యంలో పట్టణంలో ఆదివారం జెండా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పీఠాధిపతి కుమారుడు సయ్యద్ షా తాహీర్ పీరాఖాద్రీ తెలిపారు. శనివారం స్థానిక తన కార్యాలయంలో భక్తులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి పలగాడి వీధిలోని పీఠాధిపతి ఇంటి వద్ద నుంచి గంధోత్సవం ప్రారంభమై, అనంతరం జెండాతో పురవీధులు గుండా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం సాయంత్రం పలగాడి సెంటర్‌లో అజ్మీర్ షరీఫ్ జీవిత చరిత్రపై కర్నూల్‌కు చెందిన ఆస్థానయే లతీఫ్ లౌబాలి పీఠాధిపతి సయ్యద్‌షా రిజ్వాన్ పాషా ఖాద్రీ, అలాగే పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్ పీరాఖాద్రీలచే ప్రత్యేక ప్రసంగ కార్యక్రమంలో ఉంటుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

• ముమ్మరంగా జొన్న నూర్పిళ్లు



జొన్న పంటను కోస్తున్న కూలీలు



జొన్న కంకులను నూర్పిడి చేస్తున్న కూలీలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న తెల్ల జొన్నలు

మండలంలో పచ్చ, తెల్ల జొన్నల నూర్పిళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు 1000 ఎకరాలలో జొన్న పంటను సాగు చేశారు. పచ్చజొన్నలు ఎకరాకు 6 నుంచి 9 క్వింటాళ్లు, తెల్ల జొన్నలు ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని రైతులు తెలిపారు. పచ్చొజొన్నల క్వింటా ధర రూ.5000, తెల్ల జొన్నల క్వింటా ధర రూ.2300 బహిరంగ మార్కెట్‌లో ఉండటంతో రైతులు పండిన పంటను విక్రయిస్తున్నారు. ఖర్చులు అన్నీ పోను ఎకరాకు రూ.20000 మిగులు తోందని రైతులు తెలిపారు. – పెద్దముడియం

ఆరోగ్య ప్రదాత సూర్య భగవానుడు

కడప కల్చరల్ : సృష్టిలో సకల జీవరాశులకు ఆరోగ్యాన్ని ప్రసాదించే సూర్య భగవానుడి శక్తిని సైన్స్ కూడా ఆమోదిస్తోందని స్పెషల్ కలెక్టర్ రామ్మోహన్ అన్నారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల అనుబంధ సంస్థ హిందూ ధర్మ ప్రచార పరిషత్ శనివారం రథసప్తమిని పురస్కరించుకుని కడప నగరంలోని సాయి విజ్ఞాన్ హైస్కూలులో విద్యార్థులతో శాస్త్రీయంగా సూర్య నమస్కారాలు చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పెషల్ కలెక్టర్ రథసప్తమి విశిష్ఠతను వివరించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా మానవుని ఆరోగ్యంపై సూర్యుని ప్రభావం గొప్పగా ఉందని తెలిపారు. ప్రముఖ యోగా థెరపిస్టు, లయన్ డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి తొలుత ఆదిత్య హృదయం పఠింపజేసి సూర్య నమస్కారాల విశిష్ఠతను తెలియజేశారు. అనంతరం సూర్య నమస్కారాలను చేయించారు. హైస్కూలు చైర్మన్‌భూపతిరాయల్, ప్రిన్సిపాల్ మైథిలి సూర్యనమస్కారాలు ఆచరించారు.



సూర్య నమస్కారాలను ఆచరింపజేస్తున్న డాక్టర్ రంగనాథరెడ్డి

విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకోవాలి

మున్సిపల్ ఉర్దూ, మెయిన్ స్కూల్లో వ్యక్తిత్వ వికాసం కెరీర్‌పై అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ జీవిత లక్ష్యాన్ని ఎంచుకుని అందుకు అనుగుణంగా కష్టపడాలని స్టెప్ సీఈఓ సాయి గ్రేస్,వ్యక్తిత్వ వికాస నిపుణులు నరసింహాచారి సూచించారు. శనివారం యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్, ఉర్దూ బాలుర హైస్కూల్‌తోపాటు సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో వ్యక్తిత్వ వికాసం– కెరీర్‌పై కౌన్సెలింగ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణులు నరసింహాచారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచి ఆరోగ్య, అలవాట్లను అలవరచుకోవాలన్నారు. స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ యువజన సర్వీసులశాఖ ద్వారా యువతకు వ్యక్తిత్వ, వికాసంతోపాటు కళలు, క్రీడలు, దిశ యాప్ మొదలగు వాటిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పుష్పలత, ఉపాధ్యాయులు రామోహన్, సిద్దారెడ్డి, శ్రీదేవి, సాజిద్, ఇలియాస్, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్

లూర్దుమాత తిరునాలకు జోరుగా ఏర్పాట్లు

కడప కల్చరల్ : కడప నగరం మరియాపురంలో ఫిబ్రవరి 2 నుంచి 11వ తేది వరకు నిర్వహించనున్న తిరునాల కోసం జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిర్వాహకులు దీనికోసం స్థానిక దైవ సేవకులు జోసెఫ్‌ను తిరునాల కమిటీ చైర్మన్‌గా నియమించారు. రెండు రోజులుగా ఆయన ఆధ్వర్యంలో పలు బృందాలు పాత చర్చి మైదానంలో తిరునాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బండలాగుడు పోటీకి మైదానాన్ని సిద్ధం చేశారు. చర్చి ప్రధాన భవనాలన్నింటికీ రంగులు వేసి ఆకర్శణీయంగా తీర్చిదిద్దారు. ముఖ ద్వారం, లోపల ఆర్చీలు, రంగురంగుల విద్యుద్దీపాల కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన ప్రసంగాల వేదికపైన, వేదిక ముందు భారీగా షామియానాలు, పందిళ్ల అలంకరిస్తున్నారు. ప్రాంగణంలో ప్రధాన వేదిక సమీపంలోనే భారీగా పందిళ్ల ఏర్పాటు చేస్తున్నారు. తిరునాల ప్రాంతమంతా విద్యుద్దీప సౌకర్యం కల్పిస్తున్నారు.

‘98’ డీఎస్సీ అభ్యర్థుల వినతి

కడప ఎడ్యుకేషన్ : 1998 అభ్యర్థులకు త్వరగా జాయినింగ్ లెటర్స్‌ను ఇప్పించి న్యాయం చేయాలని 1998 అభ్యర్థులు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిని కోరారు. శనివారం సాయంత్రం కడపలోని జెడ్పీ ఆవరణలో ఆయనను కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1998 డీఎస్సీ అభ్యర్థులకు గత ప్రభుత్వం చేయని విధంగా ఈ ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేసిందన్నారు. ఇందుకు సంబంధించి ఎంపిక చేసిన అభ్యర్థులకు త్వరగా జాయినింగ్స్‌ను ఇప్పించాలని వారు కోరారు. డీఎస్సీ అభ్యర్థులు, రామచంద్ర, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కషాయాలను వినియోగించుకోండి

మైదుకూరు : ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్న రైతులు ఆర్బీకేలలో ఉన్న కషాయాలను వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న తెలిపారు. మండలంలోని జీవీ సత్రంలో శనివారం స్వయం సహాయక సంఘాల మహిళలకు నాబార్డు సహకారంతో రెండో రోజు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులను తగ్గించుకోవచ్చునన్నారు. సేంద్రీయ ఎరువులను వాడటం వల్ల భూ సారాన్ని పెంచవచ్చని తెలిపారు. వనిపెంట కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త కాంతిశ్రీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు పంటల సాగులో చైతన్యవంతులుగా ఉన్నారన్నారు. వివిధ పంటల సాగులో మెళకువలను తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు సూర్యనారాయణ రెడ్డి, నాగలక్ష్మి, డీపీసీసీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సీఆర్పీలు బాలయ్య, బాలస్వామిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ లక్ష్మీప్రసన్న

పిల్లలకు చదువు, మంచి నడవడిక నేర్పాలి

జూనియర్ సివిల్ కోర్టు జడ్జి

చాపాడు : తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు, అంతస్థులు ఇవ్వాల్సిన అవసరం లేదని చదువు, మంచి నడవడిక ఇస్తే వారే గొప్పవారవుతారని మైదుకూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.ఖాజా మైనుద్దీన్ అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద శనివారం సాయంత్రం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో పరిస్థితులు ప్రభావాల వలనే సమస్యలు ఉత్పన్నమవుతాయని ఈ క్రమంలో క్షమించే గుణం ఉంటే సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోలీసుస్టేషన్లు, కోర్టులకు వెళ్లి ఉచిత న్యాయం పొందవచ్చన్నారు. ఫిబ్రవరి 11న మైదుకూరు కోర్టు వద్ద జాతీయ లోక్ అదాలత్ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో రాజీ మార్గమే రాజమార్గంగా కేసులు పెట్టుకున్న వారు రాజీ అయితే వాటిని కొట్టివేయడం జరుగుతుందన్నారు. ఏవైనా వస్తువులు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రశీదులు పొందాలన్నారు. వాటి ద్వారా ఎలాంటి నష్టం వాటిల్లినా నష్ట పరిహారం పొందవచ్చన్నారు. అనంతరం పలువురు న్యాయ వాదులు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కేసీ రాజు, న్యాయ వాదులు జీపీ జ్వాలా నరసింహశర్మ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు రవిశంకర్, జేకే చారీ, రవి, ఏఎస్ఐ శంకరయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ఖాజా మైనుద్దీన్